# మాయమాటలతో ప్రజలను మోసం చేయలేరు



ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు ఏకగ్రీవ తీర్మానపత్రాన్ని అందజేస్తున్న పెట్రాల్‌చేను ప్రజలు

- కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టారు
- ప్రభుత్వవిప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- బీఆర్ఎస్ వెంటే ఉంటామని పెట్రాల్‌చేను గ్రామస్తుల తీర్మానం
- గులాబీగూటికి చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

అమ్రాబాద్, నవంబర్ 4 : కాంగ్రెస్ చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం పదర మండలంలోని రాయలగండితండా, పెట్రాల్‌చేనుకు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అచ్చంపేటలో ఎమ్మెల్యే గువ్వల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గువ్వల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గువ్వల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మె ల్యే వంశీకృష్ణ ప్రజలకు మాయమాటలు చెప్పి పార్టీలో చేర్చుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు బలవంతంగా కాంగ్రెస్ కండువాలు కప్పి మోసం చేస్తున్నారని ఆరోపించారు. మాయమాటలతో ప్రజలను మోసం చేయలేరని బలవంతంగా ఎవరినీ తమవైపు తిప్పుకోలేరని చెప్పారు. రాయలగండి తండాకు చెందిన కొంత మంది బీఆర్ఎస్ నాయకులను అడ్డదారిలో తమ వైపు తిప్పుకోవాలని చూసిన వారు తిరిగి బీఆర్ఎస్‌లోనే చేరారని కాంగ్రెస్ కుట్రలను వారు తిప్పికొట్టారని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా పెట్రాల్‌చేను ప్రజలు అందరూ అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడే బీఆర్ఎస్ పార్టీ వైపు ఉంటామని కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా మిమ్మల్ని గెటిపించుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేసుకొని ఆ పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో అచ్చంపేట అభివృద్ధి కమీషన్లకు మాత్రమే సరిపోయిందని నేడు బీఆర్ఎస్ ప్రభుత్వంతో అచ్చంపేట అంతా అభివృద్ధి, సంక్షేమంలో వెలుగులు నింపుకుందని మేమంతా కారు గుర్తుకు ఓటువేసి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించుకుంటామని ప్రకటించారు. కార్యక్రమంలో పదర బీఆర్ఎస్ నాయకులు రాంబాబునాయక్, శ్రీను, ఎల్లయ్య, జాన్సన్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు ఉన్నారు.

### అభివృద్ధికి పట్టం కట్టండి

చారకొండ, నవంబర్ 4 : పదేండ్ల ప్రస్థానంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఆదరించి పట్టం కట్టాలని, తన బలం..బలగం నియోజకవర్గ ప్రజలేనని విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో అగ్రహారంతండాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు నమ్మి మోసపోవద్దని, అభివృద్ధి చేసే వారిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గురువయ్యగౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు గజ్జెయాదయ్యగౌడ్, సర్పంచులు ప్రశాంత్‌నాయక్, అనిశెట్టి శ్రీను, నరేశ్‌నాయక్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

అచ్చంపేటటౌన్, నవంబర్ 4 : కాంగ్రెస్ పార్టీకి కౌన్సిలర్ అభ్యర్థి ఖలీల్ శనివారం అచ్చంపేటలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల నుంచి అచ్చంపేటకు వచ్చిన రాజస్థాన్‌కు చెందిన మారువాడిలు అచ్చంపేటలో వ్యాపారం కొనసాగిస్తున్న మాకు ఎప్పుడూ రక్షణగా ఉంటున్న స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రుణపడి ఉంటామంటూ ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పులిజాల రమేశ్, కౌన్సిలర్ గోపిశెట్టి శివ, నాయకులు రహమత్, జబ్బు ఎల్లయ్యయాదవ్, గంట్ల సురేశ్, అంజిరెడ్డి, ఆక జయన్న, ఆకారపు లక్ష్మణ్, నర్సింహ, దూళ్ల సురేశ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బిజినేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

# అభివృద్ధికి నిదర్శనం బీఆర్ఎస్

- విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట
- త్వరలో టీహబ్, ఇంజినీరింగ్ కాలేజీ, పరిశ్రమల ఏర్పాటు
- బిజినేపల్లి ఇంటింటి ప్రచారంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి, నవంబర్ 4: అభివృద్ధికి నిదర్శనం బీఆర్ఎస్ ప్రభుత్వమని, గడిచిన తొమ్మిదేండ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అభివృద్ధి చెందుతున్న మొదటి రాష్ట్రంగా గుర్తింపు వచ్చేలా సీఎం కేసీఆర్ సారథ్యంలో ప్రభుత్వం పనిచేసిందని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బిజినేపల్లిలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయనిఇంటింటిప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాగరకర్నూల్ జిల్లాలో టీహబ్, ఇంజినీరింగ్ కళాశాలు, వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా రెండుమూడు సమస్యలు మాత్రమే దృష్టికి వస్తున్నాయని, వాటిలో డబుల్ బెడ్రూం ఇండ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు మాత్రమే అని, వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలో వ్యవసాయరంగానికి పెద్దపీట వేయడం వల్ల గ్రామాల్లోని రైతులు, పేదలు ఆర్థికంగా ఎదిగారని చెప్పారు. ప్రస్తుతం ఎంజీకేఎల్ఐ ద్వారా సాగునీటిని అం దించడం జరుగుతుందని త్వరలో పాలమూరు-రంగారెడ్డి పథకంలో భాగంగా మార్కొండేయ రిజర్వాయర్ల ద్వారా పంటలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి గృహలక్ష్మి పథకం కింద నాలుగు వేల ఇండ్లు రావడం జరిగిందని, ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిందని, కోడ్ ముగిసిన తర్వాత వెంటనే మంజూరు చేస్తామన్నారు. ఎంజేఆర్ ట్రస్టు ద్వారా నిరుపేదలకు పెండ్లిళ్లు, ఆలయాలు, పాఠశాలలు నిర్మించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 50 వేల పింఛన్లు అందించామని, మరో 4 వేల పింఛన్లు త్వరలోనే అందిస్తామన్నారు. తొమ్మిదేండ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి పేదవాడికి అందించడం జరిగిందని గుర్తు చేశారు.మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి కలుపుకొని ముందుకు పోతామని ప్రజలందరూ అభివృద్ధి చేస్తే బీఆర్ఎస్ అం డగా నిలిచి మరో సారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్మయ్య, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పులేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బాలరాజుగౌడ్, విజయ్, బాలస్వామి, ఆయా గ్రామాల నేతలు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు

తాడూరు, నవంబర్ 4 : మండలంలోని చర్లఇటిక్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రవీందర్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పరశురాములు శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

# బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించండి

- మూడోసారి కేసీఆర్‌ను సీఎంను చేసుకుందాం
- కాంగ్రెసోళ్లతో అప్రమత్తంగా ఉండండి
- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- అభివృద్ధి చేసే నాయకుడిని మరువొద్దు
- నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు
- బీఆర్ఎస్‌లో భారీగా చేరిన వివిధ పార్టీల నాయకులు



కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

కొల్లాపూర్, నవంబర్ 4 : మీ ఇంటి పెద్దకొడుకు సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించి మూడోసారి కేసీఆర్‌ను సీఎంను చేసుకుందామని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కొల్లాపూర్ మండలం సింగవట్నంలో ఎమ్మెల్యే బీరం వ్యవసాయ క్షేత్రంలో శనివారం కాంగ్రెస్, టీడీపీ, జగదీశ్వర్‌రావు వర్గీయులు నియోజకవర్గంలోని చిన్నంబావి, వీపనగండ్ల, పాన్‌గల్ మండలాల్లోని 1500మంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీ రాములు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్‌రావు, గౌరారం వెంకట్‌రెడ్డి, ధారాసింగ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీకండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీ నాయకుడు ధారాసింగ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ గాయిగాయి గత్తర చేసే కాంగ్రెసోళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కర్ణాటక మోడల్ అంటూ తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు చెప్పే బూటకపు వాగ్దానాలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచి అధికారం చేపట్టిన కూడా ఆ పార్టీ పెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలకు అతిగతీ లేకుండా పోయిందని ఆరోపించారు. అక్కడ రోజుకు 7గంటల కరెంట్ కూడా అందించలేమని ఆ రాష్ట్ర మంత్రే స్వయంగా ప్రకటన చేశాడంటే అక్కడ రైతులు పడుతున్న కష్టాలు అంతా ఇంతా కావన్నారు. మీరు మాలాగా కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోయి గోసపడొద్దంటూ కర్ణాటక రైతులు తెలంగాణకు వచ్చి ఇక్కడి ప్రజలను అప్రమత్తం చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే బీరం గుర్తు చేశారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ ఇచ్చే 24గంటలు నాణ్యమైన ఉచిత కరెంట్ కావాలా? లేక రేవంత్‌రెడ్డి ఇచ్చే 3గంటల కరెంట్‌కావాలో తేల్చుకొనే సమయం ఆసన్నమైందని, ఆ నిర్ణయం మీ చేతుల్లోనే ఉందన్నారు. పంచాయితీరాజ్‌శాఖ మంత్రిగా ఉన్న జూపల్లి నియోజకరవ్గంలో రహదారులను అభివృద్ధి చేయలేని అసమర్థుడని విమర్శించారు. కొల్లాపూర్ ప్రాంత ద్రోహి జూపల్లి అని ఎమ్మెల్యే బీరం మండిపడ్డారు. కాంగ్రెసోళ్లు ఓట్ల కోసం మీ ఇంటి ముందుకు వస్తారు. ఓట్ల పండుగ ముగిశాక మనకు కనపడకుండా పోతారని అలాంటి వారిని నమ్మవద్దని, అభివృద్ధి చేసే నాయకులకు అండగా ఉండాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి, నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు మాట్లాడుతూ నాడు ఉమ్మడి జిల్లాలో అభివృద్ధిలో కొల్లాపూర్ వెనుకబాటులో ఉండగా.. నేడు అదే ఉమ్మడి జిల్లాలో అభివృద్ధిలో మేటిగా నిలబడుతుందని, అందుకే మనకు అభివృద్ధి చేసే నాయకుడు బీరంను మీరు మరువొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం వివిధ పార్టీల నుంచి చిన్నంబావి మండలం లో దగడపల్లిలో 72మంది, అయ్యవారిపల్లిలో సాయిలు, కృష్ణయ్య, చిన్నపుల్లయ్యతోపాటు ఐదుగురు, కొప్పునూర్‌లో కాంతారావు, గోవింద్, బె క్కెం నేలబిల్కు, పెద్దబిల్కు గ్రామాల నుంచి 50 మంది, చిన్నంబావి మండల బీఎస్పీ అధ్యక్షుడు మహేశ్‌బండారి, మియ్యాపూర్ ఉపసర్పంచ్ శివ, పాన్‌గల్ మండలం కదిరెపాడు నుంచి 20మందితో పాటు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీతోపాటు జగదీశ్వరావు వర్గీయులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో వివిధమండలాల నాయకులు ఉన్నారు.

# నేడు ఆమనగల్లుకు మంత్రి కేటీఆర్ రాక

- ఏర్పాట్లను పరిశీలించిన కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



దివ్యాంగుల సభలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి/ఆమనగల్లు, నవంబర్ 4 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాష్ట్ర పురపాలక, శాఖ ఐటీ శాఖ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆమనగల్లులో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే భారీ బహిరంగ సభకు దాదాపు 50 వేల మందిని సమీకరించే ఏర్పాట్లలో పార్టీ శ్రేణులు నిమగ్నమయ్యాయి. శనివారం సాయం త్రం బహిరంగ ఏర్పాట్లను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరిశీలించా రు. బహిరంగ సభ విజయవంతానికి పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు.

### భారీగా చేరికలకు ఏర్పాట్లు

బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా నిర్వహించే భారీ బహిరంగసభ ప్రారంభానికి గంట ముందుగానే పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమనగల్లు చేరుకుంటారు. ఆమనగల్లు సమీపంలోని విఠాయిపల్లి వద్ద ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ చేరికల కార్యక్రమంలో పాల్గొంటారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని 7 మండలాల్లో వివిధ పార్టీలలో కొనసాగుతున్న నాయకులు కార్యకర్తలు దాదాపు వెయ్యి మంది ఎమ్మెల్యే నేతృత్వంలో మంత్రి కేటీఆర్ సమక్ష్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు.

### దివ్యాంగులను ఆదుకున్న రాష్ట్రం తెలంగాణ

ఆమనగల్లు, నవంబర్ 4 : దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఆలేటి నారాయణ పంక్షన్ హాల్ ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండలాలకు చెందిన 3 వేల మంది దివ్యాంగులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ దివ్యాంగులకు సీఎం కేసీఆర్ వారి జనాభా ప్రతిపాదికన అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దివ్యాంగులకు రాష్ట్ర బడ్జెట్‌లో 5శాతం కేటాయించనున్నట్లు ఆయన వివరించారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో 500 గజాల స్థలాన్ని కేటాయించి రూ. 25లక్షలతో భవన నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. అనంతరం ముర్తుజపల్లి, తలకొండపల్లి మండలం లింగరావుపల్లికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 50 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లి కార్జున్, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, తోట గిరియాదవ్ ఉన్నారు.